రుణమాఫీపై సర్వత్రా హర్షం

ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఆత్మ బంధువుగా మారాడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. దశలవారీగా చేపట్టిన రుణమాఫీలో రూ.లక్ష మాఫీ చేసినందుకు ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో గురువారం సీఎం, మంత్రుల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రైతు వేదికల్లో సీఎం వీడియో ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు.


మిట్టపల్లి రైతువేదికలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ మను చౌదరి


కొండపాకలో క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి


హుస్నాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి


వర్గల్‌లో ..


చేర్యాలలో..


సిద్దిపేటలో ..


కోహెడలో..

క్లుప్తంగా

మాదిగలను బీజేపీ మోసం చేసింది

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

తొగుట(దుబ్బాక): సార్వత్రిక ఎన్నికల్లో మాదిగ కులస్తుల ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ కోసం మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీన యాదగిరి గుట్ట వద్ద గల లక్కీ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, స్వామి, మహేష్ పాల్గొన్నారు.

టీజీబీ మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ


రంజిత్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బస్వాపూర్ బ్రాంచ్ నూతన మేనేజర్‌గా అంబటి రంజిత్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై బ్రాంచ్ మేనేజర్‌గా రావడంతో ఖాతాదారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న కళాకారులు

సిద్దిపేటకమాన్: అర్హులను గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా ఉద్యమ కళాకారులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి 550 మంది ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అర్హత కలిగిన నిరుద్యోగ కళాకారులను గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

హామీలు నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ అన్నారు. రుణమాఫీ సందర్భంగా దుబ్బాక రైతు వేదికలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడే కార్యక్రమాన్ని వీక్షించేందుకు అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులతో కలిసి బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

చిన్నారి కుటుంబానికి పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): కుక్కల దాడిలో చికిత్స పొందుతూ మృతి చెందిన 18 నెలల చిన్నారి విహాన్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు మిరుదొడ్డిలో గురువారం పరామర్శించి ఓదార్చారు. చిన్నారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, జిల్లా నాయకుడు సూకూరి లింగం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు ఉన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు


దుబ్బాకలో విరబూసిన బ్రహ్మ కమలాలు

దుబ్బాక టౌన్: శీతల ప్రాంతాల్లో కనిపించే అరుదైన బ్రహ్మ కమలాలు దుబ్బాకలో వికసించి కనువిందు చేశాయి. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బావాజీ పర్శరాములు బ్రహ్మ కమలం మొక్కను తొమ్మిదేళ్ల క్రితం కేరళ నుంచి తెప్పించి నాటారు. వారం క్రితం మొగ్గలు రాగా, బుధవారం రాత్రి వికసించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పర్శరాములు కుటుంబ సభ్యులు వాటికి పూజ చేశారు. బ్రహ్మ కమలం శివుడికి ప్రీతికరమని పురాణాలు చెబుతున్నాయని, ఏడాదిలో ఒకసారి రాత్రి సమయంలోనే పూస్తుందని తెలిపారు. శ్వేత వర్ణంలో పెద్దగా వికసించే ఈ పూలు ఉదయానికి మొగ్గలుగా ముడుచుకుంటాయి.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

● బీఆర్ఎస్వీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలల వద్ద నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కో–ఆర్డినేటర్ ఇరుగంటి రమేష్, బీఆర్ఎస్వీ అధికార ప్రతినిధి మెరుగు మాధవ్ మాడారు. సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండే విధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు కృషి చేస్తున్నారన్నారు. అనేక ఉన్నత విద్యాసంస్థలను జిల్లాకు తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ స్థానిక విద్యార్థులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వంశీ, రాగరం రాములు, చరణ్‌గౌడ్, కమల్‌యాదవ్, జానకి, చందు, సోహెల్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

దేవాలయ భూముల పరిశీలన

గజ్వేల్‌రూరల్: దేవాలయ భూముల జోలికి వస్తే సహించేదిలేదని బీజేపీ నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని ఐవోసీ పక్కనగల దేవాలయ భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ మాట్లాడారు. పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన శివాలయానికి సంబంధించి సర్వే నంబర్ 338లోని ఐదు ఎకరాలు కొంతమంది కబ్జాకు ప్రయత్నించారని, తిరిగి అవే భూములను మరోసారి కబ్జాకు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. దేవాలయ భూముల జోలికి వస్తే ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, సందీప్, వెంకట్‌రెడ్డి, కిష్టాగౌడ్, నాగు ముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజుయాదవ్, కరుణాకర్, మల్లేష్, రోహిత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా రూ.లక్ష రుణమాఫీ చేసే సందర్భంగా రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని రైతులు వీక్షించారు. గురువారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలో గల రైతువేదికల్లో రుణమాఫీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులకు, బ్యాంకర్లు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ పర్శరాంరెడ్డి, ఏఈఓ సుమిత్రి, పార్టీ మండల అధ్యక్షుడు రాములు, గ్రామ అధ్యక్షుడు పిట్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు రుణమాఫీ విడుదల సందర్భంగా గురువారం మిరుదొడ్డిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మండల రైతులు తిలకించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మల్లేశం మట్లాడుతూ మండల పరిధిలో రూ.లక్ష లోపు పంట రుణం తీసుకున్న 3527 మంది రైతులకు తొలి విడతలో రుణమాఫీ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నిర్మల, రేణుక, లోహిత్, సాయి, అఖిల్ పాల్గొన్నారు.


సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వింటున్న రైతులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ నేపథ్యంలో సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ రైతు రుణమాఫీ పేరుతో కొందరు సైబర్ మోసగాళ్లు బ్యాంకుల పేరిట వాట్సాప్ ప్రొఫైల్, బ్యాంక్ పేరు, ఫొటో లోగోతో వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని, వీటిని ఓపెన్ చేయొద్దన్నారు. ఏపీకే ఫైల్స్ పంపి ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట


చేర్యాలలో అంగన్‌వాడీ బాట ర్యాలీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు గురువారం అమ్మ మాట...అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. అనంతరం టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించి వారి భవితకు పునాది వేయాలన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని 3, 6, 11 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి మాట్లాడారు. రెండున్నర ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కేంద్రాల్లోనే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తవుతుందని తెలిపారు. సూపర్‌జర్ నాగమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రేగులపల్లె పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, మధు, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంనగర్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో బేడ బుడగ జంగాల కులస్తులు గురువారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

సిద్దిపేటలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో గురువారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కాంగ్రెస్ మెంబర్ దరిపల్లి చంద్రం మాట్లాడుతూ ఏటా ముత్యాల పోచమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.


సిద్దిపేటలో బోనాల ఊరేగింపు

పరిశుభ్రమైన నీటిని అందించాలి

● మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని వాటర్ ప్లాంట్ల యజమానులకు మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత సూచించారు. సఫాయి అప్నా బీమారి భగావో కార్యక్రమంలో భాగంగా గురువారం మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, వాటర్ ప్లాంట్లను సందర్శించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న నీటిని బ్లీచింగ్ టెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వాటర్ ప్లాంట్లను నిర్వాహకులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వేణు యాదవ్, గోవిందు రవి, సిబ్బంది పాల్గొన్నారు.


తాగునీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: షరతులు లేకుండా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి అధ్యక్షతన సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక ఆంక్షలు విధిస్తోందన్నారు. రేషన్ కార్డు ప్రాతిపదికన రుణమాఫీ చేస్తామనడం సరికాదన్నారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో చిన్న, సన్న కారు రైతులు రుణమాఫీకి అనర్హులు అయ్యారని తెలిపారు. పట్టాదార్ పాస్‌బుక్‌ల ఆధారంగా రుణమాఫీ చేయాలన్నారు. అలాగే రుణాలను రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, కృష్ణారెడ్డి, యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్‌రూరల్: పచ్చదనంతో నిండిన పరిసరాలు ఆరోగ్యాన్నిస్తాయని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు అవసరమైన చెట్లు లేకపోవడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలను పంపిణీచేస్తున్న కమిషనర్ నర్సయ్య

ముగిసిన ఆషాఢి ఉత్సవాలు

మర్కూక్(గజ్వేల్): శ్రీ పాండు రంగాశ్రమ ఆషాఢి ఉత్సవాలు ముగిశాయి. వేలాది భక్తజన హరేరామ నామస్మరణతో ఆశ్రమం మారుమోగింది. ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి ప్రారంభించారు. గురువారం చివరి రోజు కావడంతో ఆశ్రమంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఏకాదశి జాగారం చేసిన భక్తులు గురువారం శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివార్లను దర్శించుకున్నారు. సుమారు పది వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

పోస్టర్ తయారీ పోటీలు


బహుమతులు అందజేస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వరల్డ్ పాపులేషన్ డేని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, జనాభా నియంత్రణ, సమానత్వం, ఆరోగ్యకర జీవన విధానాలపై జిల్లా స్థాయి పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగాయి. పోటీల్లో గజ్వేల్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీజ ప్రథమ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ బక్రి చెప్యాలకు చెందిన జెట్ల రక్షిత, జెడ్పీహెచ్ఎస్ నాగపూర్‌కు చెందిన సాయి దీక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఇసుక వేలం**

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరు గురువన్న గుట్ట దగ్గర సీజ్ చేసిన ఇసుక డంప్‌నకు గురువారం రెవెన్యూ అధికారులు వేలం పాట నిర్వహించారు. మనోహరాబాద్ మండలానికి చెందిన పాల అశోక్ యాదవ్ రూ.1.25 లక్షలకు ఇసుకను దక్కించుకున్నట్లు తహసీల్దార్ బాల్‌రాజు తెలిపారు.

◆ **జీపీపీ ఆర్టీసీ డీఎంగా పవన్**

గజ్వేల్‌రూరల్: జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పవన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేఖ బదిలీపై మెదక్ డిపోకు వెళ్లారు. డిపో ఉద్యోగులు, సిబ్బంది నూతన మేనేజర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీపీపీ అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఉద్యోగులు ఆర్పీ రెడ్డి, జయేందర్‌రెడ్డి, నాగభూషణం, సందీప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రుణమాఫీ ర్యాలీ**

దుబ్బాక: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేశారని, మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేశారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాకలో రైతు రుణమాఫీ సందర్భంగా సంబరాలు నిర్వహించారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ తీశారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో గంటల ప్రాతిపదికన బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు శనివారం పాఠశాలలో నిర్వహించే డెమోకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.18200 వేతనం ఉంటుందని తెలిపారు.

◆ **దరఖాస్తు గడువు పెంపు**

సిద్దిపేటరూరల్: సిద్దిపేట ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామానుజ గురువారం తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు www.iti.Telangana.gov.inలో ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఐటీఐల్లో ఎక్కువ ట్రేడ్‌లకు ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ సిద్దిపేటలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, కోపా, మెకానిక్ డీజిల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

◆ **దరఖాస్తు ఇవ్వండి**

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని రైతులు ప్రభుత్వ రుణమాఫీ విషయంలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు గ్రామాల్లో రుణమాఫీ సమస్యలు తెలుసుకొని కార్యాలయంలో తెలియజేయాలన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామన్నారు.

◆ **చట్టాలపై అవగాహన ఉండాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. గురువారం చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలు, నూతన చట్టాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

లకుడారం గ్రామ హైస్కూల్లో..

కొండపాక(గజ్వేల్): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ హైస్కూల్లో మహిళల రక్షణ, సైబర్ నేరాల రక్షణలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లతీఫ్ మాట్లాడారు. అపరిచితులు ఫోన్ చేస్తే స్పందించవద్దన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా వల్ల జరిగే నష్టాలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, 1930 పై అవగాహన కల్పించారు.

◆ **పీర్ల ఊరేగింపు**

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లలో మొహర్రం వేడుకలు గురువారం రాత్రి వరకు జరిగాయి. గ్రామంలో రెండు మసీదుల్లో 25 పీర్లను ఏర్పాటు చేశారు. వాటిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో పలువురు దట్టీలు, ఊదు బెల్లం సమర్పించారు. పీర్ల ఊరేగింపును తిలకించేందుకు గ్రామాలను నుంచి తరలివచ్చారు.

◆ **విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రెండు రోజులుగా తోటపల్లి, గాంధీనగర్ గ్రామాలకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో టీవీలు, గృహోపకరణాలు కాలిపోతున్నాయని గ్రామస్తులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.